క్లుప్తంగా

కోయిలకొండ విద్యార్థినుల ప్రతిభ



దీఈఓ నుంచి సర్టిఫికెట్లు అందుకుంటున్న బాలికలు

కృష్ణగిరి: జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో శనివారం వరల్డ్ థింకింగ్ కార్యక్రమాన్ని డీఈఓ శామ్యూల్‌పాల్ ప్రారంభించారు. కోయిలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు సునీత, కృష్ణసేవిత ప్రతిభ చూపారు. దీంతో వారికి డీఈఓ తృతీయ సోపాల్ సర్టిఫికెట్లను అందజేసినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు హుకుంసింగ్ తెలిపారు.

తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలి

తుగ్గలి : మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని డ్వామా క్లస్టర్ ఏపీడీ పక్కీరప్ప అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో శనివారం ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప అధ్యక్షతన సామాజిక తనిఖీ బృందాలు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చేసిన ప్రతిపని తనిఖీ చేసి అక్రమాలు ఏవైనా జరిగి ఉంటే క్షేత్ర స్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు వెలికి తీయాలన్నారు. కూలీలను కలిసి వేతనాలు అందాయా లేదో ఆరా తీయాలని చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూడా తనిఖీ బృందాలకు సహకరించాలని సూచించారు. ఏపీఓలు హేమసుందర్, రామకృష్ణ, హార్టికల్చర్ సూపర్‌వైజర్ రత్నం, ఈసీ ప్రదీప్‌కుమార్, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో ఉచిత వైద్యశిబిరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పత్తికొండ రూరల్ : పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబ ఆలయం ప్రాంగణంలో కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పత్తికొండ చుట్టుపక్కల గ్రామాల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న 180 మంది వైద్యశిబిరానికి వచ్చి కంటి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ కంటి వైద్యనిపుణుడు డాక్టర్ సురేష్ బాబు రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి 75 మందికి శస్త్రచికిత్సలు అవసరమని తెలిపారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి, మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. నేత్ర జిల్లా కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ము నెట్టికల్ పాల్గొన్నారు.

అన్నదానం

హొళగుంద: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ దంపతులు శివ మాలధారులకు అన్నదానం చేపట్టారు. అంతకు ముందు శివస్వాముల ఆధ్వర్యంలో సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి స్థానికులు, చుట్టుపక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి శివ మాలధారులు తరలివచ్చారు.

నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ జూటూరు హేమలత

చిప్పగిరి: వేసవి కాలం ప్రారంభం కావడంతో మండలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ జూటూరు హేమలత మండల అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఎంపీడీఓ అల్లాబకాష్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇజాజ్ అహమ్మద్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బాలన్న, చిప్పగిరి,నంచర్ల సర్పంచులు ,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గర్జిలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

హొళగుంద: ముద్దటమాగి గ్రామంలో ఆదివారం జరిగే నెరెణికి లింగేశ్వరస్వామి ద్వితీయ పట్టాభిషేక ఉత్సవ కార్యక్రమానికి ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామం నుంచి గర్జిలింగేశ్వర, అయ్యమ్మవ్వ ఉత్సవమూర్తులు పల్లకీలో శనివారం హొళగుంద నుంచి ఊరేగింపుగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వర పడిపూజ

మండలంలోని గజ్జహళ్లి గ్రామంలో శనివారం పార్వతీ పరమేశ్వరస్వామి పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. శివ మాలధారులు స్థానిక పోతులింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పార్వతీ పరమేశ్వరులకు పడిపూజ నిర్వహించారు. అనంతరం లింగాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై అభ్యంతరం

శ్రీరాంనగర్ క్యాంపులో మూతబడిన పాఠశాలకు అడ్డంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండగా.. స్థలదాతలు శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. దిమ్మె ఏర్పాటుపై ఫిర్యాదు చేయడంతో ఎంఈఓ-1 సత్యనారాయణ ఆక్రమణను పరిశీలించారు. విషయాన్ని విద్యుత్ శాఖాధికారిణి ఓబులమ్మ దృష్టికి తీసుకెళ్లి వెంటనే తొలగించాలని కోరారు.

అక్రమార్కులకు అడ్డేదీ?

- ఆగని ఎర్రమట్టి తరలింపు
- హత్తిబెళగల్ గ్రామ కొండలో అర్ధరాత్రి మట్టి తవ్వకాలు
- తవ్వకాలను నిషేధించిన అధికారులు
- అయినా.. తరలించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- చోద్యం చూస్తున్న మైనింగ్ అధికారులు

అక్రమార్కుల దుశ్చర్యలకు కొండలు కరిగిపోతున్నాయి.. మట్టిని తవ్వి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.. యంత్రాంగం నిద్ర నటిస్తుండటంతో ప్రకృతి వనరులు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. విమర్శలు తీవ్రమవడంతో ఆలస్యంగా మేల్కొన్న అధికారులు తవ్వకాలను నిషేధించినా.. అక్రమార్కుల తీరు మారడం లేదు. గతంలో పగటి పూట దర్జాగా మట్టి తరలించిన వారు.. ప్రస్తుతం రాత్రి పూట తమ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఎటుతిరిగి తవ్వకాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి.



హత్తిబెళగల్ వద్ద కృష్ణాపురం కొండలో మట్టి తవ్వకాలు జరిపిన దృశ్యం



తవ్వకాలు నిషేధించినట్లు బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు (ఫైల్)

ఆలూరు రూరల్: మండలంలో ఎర్ర మట్టి తవ్వకాలను నిషేధించినా.. గ్రావెల్ తరలింపు ఆగడం లేదు. అర్ధరాత్రి పూట కొండలను పిండి చేస్తున్నారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పొలాల్లో నుంచి అడ్డదారులు వెతుక్కొని ట్రాక్టర్లు, టిప్పర్లలో గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆలూరు ప్రాంతంలో సహజ వనరులు కరిగిపోతున్నాయి. నిరోధించాల్సిన మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అర్ధరాత్రి మట్టి తవ్వకాలు..

మండలంలోని హత్తిబెళగల్ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 557లో 105.04 ఎకరాల్లో కృష్ణాపురం అనే ఎర్ర మట్టి కొండ ఉంది. ఈ కొండలోని ఎర్రమట్టి నాణ్యమైనది కావడంతో అవసరాల కోసం ప్రతి ఒక్కరూ ఈ మట్టినే తరలించే వారు. అయితే తవ్వకాలు తీవ్రమవడం, అక్రమార్కుల కన్ను పడటంతో కొండ ఇప్పటికే 70 శాతం కరిగిపోయింది. దీంతో ఆలస్యంగా మేల్కొన్న అధికారులు ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు రెవెన్యూ సిబ్బంది గ్రావెల్ తవ్వకాలు నిషేధమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ.. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి కొండ నుంచి మట్టి తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

నిషేధం విధించిన అధికారులు..

కృష్ణాపురం కొండ పూర్తిగా కనుమరుగయ్యే అవకాశం ఉండటంతో.. భూగర్భ గనుల శాఖ అధికారుల అనుమతులు లేనిదే తవ్వకాలు చేపట్టరాదని, గ్రావెల్ తరలింపు నిషేధిస్తూ మండల రెవెన్యూ అధికారులు హత్తిబెళగల్,అగ్రహారం కొండల్లో ఈ నెల 13న హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. గత కొన్ని నెలలుగా మండలంలోని హత్తిబెళగల్,అగ్రహారం కొండ సర్వే నంబర్ 915బీ లో 16 ఎకరాలు, 969 సర్వే నంబర్‌లో 662 ఎకరాల విస్తీర్ణం, సర్వే నంబర్ 557లో(కృష్ణాపురం కొండ) 105.04, 1568 సర్వే నంబరులో 9.30 ఎకరాల విస్తీర్ణంలోనున్న కొండలను కొందరు త్వకాలు జరిపి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించి సొమ్ము చేసుకుంటున్నారని అధికారులకు ఫిర్యాదుల అందాయి. ఇందులో భాగంగానే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆదేశాలు ధిక్కరించి గ్రావెల్ తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, వాహన యజమానులపై కేసులు నమోదు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయినప్పటికీ కొందరు తవ్వకాలను ఆపడం లేదు. అక్రమార్కుల చర్యలపై సమాచారం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు మౌనముద్ర దాల్చడం విమర్శలకు తావిస్తోంది.

కర్ణాటకకు తరలింపు..

మండలంలోని పలు కొండల నుంచి తవ్విన మట్టిని కర్ణాటక రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి పనుల్లో వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ జరుగుతున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, రోడ్లు తదితర నిర్మాణాల్లో బండింగ్ కోసం ఈ నాణ్యమైన మట్టి అవసరమవుతుండటంతో అక్రమార్కులు రాత్రింబవళ్లు టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

అనుమతులు లేకుండా తవ్వరాదు



గ్రావెల్ తరలించేందుకు భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కొండల నుంచి మట్టి తవ్వకాలను నిషేధిస్తూ ఆయా ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేయించాం. అనుమతి లేకుండా మట్టి తరలిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– గోవింద్ సింగ్, తహసీల్దార్ ,ఆలూరు

మండల సమావేశమంటే అంత నిర్లక్ష్యమా?



మాట్లాడుతున్న ఎంపీపీ నారాయణదాస్

పత్తికొండ రూరల్ : మండల సమావేశంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, సంబంధిత అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ నారాయణదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని సమావేశ భవనంలో శనివారం ఎంపీడీఓ స్వర్ణలత ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 11గంటలు దాటినా అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడం, పలు శాఖల అధికారుల సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు కావడంతో అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండటంతో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. తహసీల్దారు రమేష్, వైస్ ఎంపీపీలు బలరాముడు, రంగమ్మ, ఈఓ నరసింహులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్టులను రద్దు చేయాలి



మొలగవల్లి గ్రామ రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ఆలూరు రూరల్: రైతుల నుంచి తక్కువ ధరతో భూములు కొనుగోలు చేస్తున్న సోలార్ కంపెనీల ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ఆలూరు,ఆస్పరి మండలాల్లోని మొలగవల్లి,ముద్దనగేరి, జొహరాపురం గ్రామాల్లో సోలార్ ప్రాజెక్టుకు భూములు విక్రయించే రైతులతో శనివారం ఆయన చర్చించారు. అనంతరం ఆలూరులోని జ్యోతిబసు భవన్‌లో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోలార్ కంపెనీలు ఎకరా భూమిని రైతు నుంచి రూ.5 లక్షలకు కొనుగోలు చేస్తున్నారని.. ఏడాదికి లీజు కింద రూ.30 వేలు చెల్లించి 30 ఏళ్ల పాటు లీజు కింద రాయించుకుని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. దీనికి తోడు భూమిని లీజుకు ఇచ్చే రైతులే బ్యాంకులలో పొలంపై తీసుకున్న అప్పులు చెల్లించి సంబంధిత పొలం పత్రాలను కంపెనీకి ఇవ్వాలనే నిబంధనలు పెట్టారన్నారు. అలాకాకుండా ఎకరా భూమిని రూ.25 లక్షలకు కొనుగోలు చేయాలని, ప్రతి నెల రూ.30 వేలు లీజు చెల్లించాలని కోరారు. రాయలసీమ కరువు ప్రాంతం కావడంతో ఇక్కడి భూముల ధర తక్కువ ఉంటాయని సోలార్ కంపెనీలు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నాయని తెలిపారు. కోస్తా ప్రాంతంలో భూముల ధరలు ఎక్కువగా ఉంటాయని, అలాగే అక్కడి రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు రారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే మధ్యవర్తిగా ఉండి ఆయా కంపెనీలకు రైతుల నుంచి భూములు లీజుకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలూరులో వచ్చే నెల 5,6వ తేదీల్లో దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, సూరి, మండల కార్యదర్శులు ఈరన్న,ధనుంజయ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి



విద్యార్థి సంఘాల నాయకులు, వార్డెన్, ట్యూటర్‌ను విచారిస్తున్న జీసీడీఓ స్నేహలత

కృష్ణగిరి: గత కొన్ని నెలలుగా విద్యార్థినులను అర్థాకలితో ఇబ్బందులకు గురి చేస్తున్న మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, వార్డెన్ సుజాతను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదరి రాజు డిమాండ్ చేశారు. శనివారం వారు ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు హనుమంతు, భాస్కర్‌తో కలిసి హాస్టల్ విద్యార్థులను కలిసి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా ప్రిన్సిపాల్, వార్డెన్ పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం అధికారుల పరిశీలనలో మోనూ పాటించకపోవడంతో పాటు భోజనం నాణ్యతగా లేదని హెచ్చరించినా వీరిలో ఏలాంటి మార్పు రాలేదన్నారు. శనివారం రోజు కూడా ఉదయం చపాతి, పూరి గానీ పెట్టాల్సి ఉండగా పొంగలి పెట్టడంతోపాటు అందులోకి చెట్నీ సరిగా లేదని విద్యార్థినులు తినకుండా పడేశారన్నారు. అలాగే మధ్యాహ్నం కూడా మోనూ ప్రకారం కాకుండా వారికి ఇష్టమైన వంట చేసి పెట్టడాన్ని చూస్తే వీరి నిర్లక్ష్యం తీరును చాటుతుందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు సురేంద్ర కుమార్, సీపీఐ నాయకులు చిన్నమాదులు, రాజేంద్ర, మన్సూర్ పాల్గొన్నారు.

విచారణ చేపట్టిన జీసీడీఓ

మోడల్‌స్కూల్ విద్యార్థినుల ఇబ్బందులు మీడియాలో రావడంతో జీసీడీఓ స్నేహలత శనివారం హాస్టల్‌లో విచారణ చేపట్టారు. విచారణలో నిబంధనలు పాటించడం లేదని గుర్తించినట్లు ఆమె తెలిపారు. నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తామని తెలిపారు.

'మహా'భిమానం



బొంతిమడుగుల పెద్దయ్య



ఇంటికి వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు వేయించిన దృశ్యం

ఆస్పరి: కొత్త ఇంటిపై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటోలు వేయించి అభిమానం చాటుకున్నాడు బిల్లేకల్లుకు చెందిన ఓ అభిమాని. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బొంతిమడుగుల పెద్దయ్య ఇటీవల కొత్తగా ఇంటిని నిర్మించుకున్నారు. వైఎస్సార్ కుటుంబంపై ఉన్న అభిమానంతో వారి ఫొటోలను ఇంటి ముందు భాగంలో వేయించి వైఎస్ ఆర్ అని పేరు కూడా పెట్టుకున్నారు. ఆదివారం గృహ ప్రవేశం చేయనున్నట్లు పెద్దయ్య తెలిపారు. ఆర్ అండ్‌బీ రోడ్డుకు సమీపంలోనే ఇల్లు ఉండటంతో దారిన వచ్చిపోయే వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

మద్దికెర :రాష్ట్ర ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పనకు అందజేస్తున్న సబ్సిడీ రుణాలు అర్హులందరికీ మంజూరు చేయాలని ఎంపీపీ అనిత, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ మండలానికి కేవలం 50 యూనిట్లు మంజూరు చేశారని, రుణాల కోసం 677 మంది దరఖాస్తు చేసుకున్నారని అయితే ఎవరికి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు అర్హులైన నిరుద్యోగులకు రుణాలు ఇస్తే స్వయం ఉపాధి పొందేందుకు వీలుంటుందన్నారు.

25న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

వెల్దుర్తి: సబ్సిడీ రుణాలకై దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ కులాల వారికి ఈనెల 25వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుహాసిని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు వెల్దుర్తి బ్రాంచ్‌లు, ఏపీజీబీ వెల్దుర్తి, గోవర్ధనగిరి బ్రాంచ్‌లు, కెనరా బ్యాంకు రామళ్లకోట, కలుగొట్ల బ్రాంచ్‌ల అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. మండలంలో 800 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని, వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిందిగా కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఆలూరు రూరల్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్డీ ప్రభాకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సర్పంచ్ అరుణాదేవి సమక్షంలో పరిసరాల పరిశుభ్రతపై పట్టణ వాసులకు వివరించారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా తడి,పొడి చెత్తను వేరు చేసి ఇంటి వద్దకు వచ్చే పంచాయతీ రిక్షాలు, ట్రాక్టర్లలో వేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలన్నారు.

సర్వే పక్కాగా నిర్వహించాలి



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీఓ

మద్దికెర : రైతులు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సర్వే పక్కాగా నిర్వహించాలని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ సూచించారు. శనివారం మండలంలోని పెరవలి గ్రామంలో జరుగుతున్న భూసర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. రైతుల పాస్‌బుక్‌లతో పాటు సర్వే నంబర్లు, ఎంత భూమి సాగులో వుందో తెలుసుకొని సర్వే చేయాలన్నారు. వీఆర్వో తమ వద్దనున్న రికార్డులు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. తహసీల్దార్ హుసేన్ సాహెబ్, వీఆర్వోలు బాలవర్ధిరాజు, హర్ష, సర్వేయర్లు యశోద పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు

వెల్దుర్తి: పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని వెల్దుర్తి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రిటైర్డ్ హెచ్‌ఎం అగస్టీన్, మల్లెపల్లె సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షుడు విద్యావేత్త వావిలాల కృష్ణమూర్తి, ప్రముఖ వక్త, ప్రైవేట్ స్కూల్ కరెస్పాండెంట్ ఏసుదాసు అన్నారు. శనివారం సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాలు నిర్వహించారు. పరీక్షలకు ఇప్పటి నుంచి ఎలా చదవాలి, ఎలా రాయాలి, మంచి ఫలితాల సాధన, ఫలితాల తర్వాత ఏం చేయాలి అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సమయంలో సమయాన్ని వృథా చేసుకోవద్దని చెప్పారు. పెన్నులు అందించి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఎంఈఓ ఇందిర, హైస్కూళ్ల హెచ్‌ఎంలు చంద్రావతి, నాయక్, సేవా సంఘం ప్రస్తుత, మాజీ ప్రతినిధులు రవి శంకర్, లక్ష్మణ స్వామి, పెద్ద ఖాజాబేగ్, జనార్ధన్ పాల్గొన్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: ఆస్పరి మండలం కారుమంచి గ్రామ శివారులో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత తెలిపారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి శనివారం నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి బెల్లం ఊట పారబోశామన్నారు. అలాగే కైరుప్పల గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న బోయ రంగన్న, చిప్పగిరి మండలంలోని బెల్డోణ గ్రామంలో భీమలింగన్నను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఎస్ఐలు నవీన్ కుమార్, సోమేష్ ఉన్నారు.

పరీక్షలపై ఆందోళన వద్దు

మద్దికెర : విద్యార్థులు పరీక్షల పట్ల ఆందోళన చెందకుండా ప్రశాంతమైన మనస్సుతో రాయాలని ఎంఈఓ రంగస్వామి అన్నారు. శనివారం పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఆపద్బంధు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజ్ఞా వికాస ప్రశ్నాపత్రాన్ని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ. ఈ నెల 24వ తేదీన 10 గంటలకు ఆదర్శ పాఠశాలలో మోడల్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్, హెచ్‌ఎం అజరయ్యబాబు పాల్గొన్నారు.



మోడల్ పేపర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

కృష్ణగిరి: మండలంలోని అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జీఓ నంబర్ 3ఏ అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం -2025 పేరిట భూముల క్రమబద్ధీకరణకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆక్రమణదారుల కుటుంబంలోని మహిళలకే ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. దీన్ని పొందిన లబ్ధిదారులకు పట్టా, రిజిస్ట్రేషన్ పత్రం అందిన రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు లభిస్తాయని చెప్పారు. 2019 అక్టోబర్ 15కు ముందు ఆక్రమణలో ఉన్న భూములను మాత్రమే క్రమబద్ధీకరణ చేస్తారని చెప్పారు.

హాలహర్వి: 3 సెంట్లు నివాస స్థలాలను కలిగిన ఉన్న లబ్ధిదారులు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ నజ్మాబాను సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జీవో నం. 30/2025 ప్రకారం 3 సెంట్ల నివాస స్థలం ఉంటే దానిపై విచారణ జరిపి లబ్ధిదారుడికి పొజిషన్ పట్టా అందజేస్తామన్నారు. వివరాలకు స్థానిక సచివాలయ వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు.

నోటీస్ బోర్డు

6 వతరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర : 2025–26 సంవత్సరానికి స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి 5వ తరగతి పూర్తయిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సవిత శనివారం తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 24 నుంచి మార్చి 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు స్థానిక మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

మార్చి 30వ తేదీలోపు..

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి దగ్గరనున్న మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ షమీల శనివారం తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఫారంను పాఠశాలలో అందజేయాలని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న ఏప్రిల్ 20న మోడల్ స్కూల్లోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి దస్తగిరిస్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని డి.కోటకొండ గ్రామంలో ఆదివారం నుంచి దస్తగిరిస్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బీటి జయలక్ష్మి శనివారం తెలిపారు. ఆదివారం గంధం, సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్‌తో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

హామీలను అమలు చేయాలి

పత్తికొండ రూరల్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని జైభీం యువత ఫౌండేషన్ అధ్యక్షుడు ఆవుల సోమన్న డిమాండ్ చేశారు. శనివారం ఫౌండేషన్ నాయకులతో కలిసి తహసీల్దారు రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాయమాటలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు, హామీల అమలు గురించి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మునిస్వామి, నాయకులు అవినాశ్, హాజి, సతీష్, సవారి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.75,971 అవినీతి



బహిరంగ విచారణ జరుగుతున్న దృశ్యం

హొళగుంద: ఉపాధి హామీ పథకంలో రూ.75,971 అవినీతి జరిగినట్లు జిల్లా అధికారులు శనివారం హొళగుందలో జరిగిన బహిరంగ సభ విచారణలో తేల్చారు. అలాగే మరో రూ.40 వేలు జరిమానా విధించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యలయ ఆవరణలో 2023–24లో జరిగిన ఉపాధి పనులపై డ్వామా అడిషనల్ పీడీ పద్మావతి, జిల్లా విజిలెన్స్ సెల్ ఆఫీసర్ లోకేశ్వర, ఎంపీడీఓ విజయలలిత ఇతర అధికారుల సమక్షంలో బహిరంగ విచారణ జరిగింది. డీఆర్పీలు సేకరించిన వివరాలను చదివి వినిపించారు. 17 గ్రామ పంచాయతీ పరిధిలో 799 ఉపాధి పనులకు రూ.11,64,70,480 ఖర్చు చేసి కూలీలకు పని కల్పించినట్లు ఏపీఓ భక్తవత్సలం తెలిపారు.

ఇరుముడితో మల్లన్న సన్నిధికి



ఆస్పరి నుంచి శ్రీశైలం బయలుదేరుతున్న శివ మాలధారులు

ఆస్పరి: మండల కేంద్రం నుంచి 40 మంది శివదీక్షాపరులు శనివారం ఇరుముడులతో శ్రీశైలం బయలు దేరి వెళ్లారు. గురుస్వామి రూపా మోహన్‌శర్మ ఆధ్వర్యంలో పక్కీరప్ప తాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి స్వీకరించారు. ఈ సందర్భంగా మాలధారుల కుటుంబ సభ్యులు, భక్తులు, బంధుమిత్రులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మాలధారులను కుటుంబ సభ్యులు ఊరేగింపుగా సాగనంపారు.